సాక్షి
అనంతపురం
శుక్రవారం । 1 । సెప్టెంబర్ । 2023



టన్ను చీనీ రూ. 20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.20 వేలు పలికాయి.



కిలో టమాట రూ.16.50

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.16.50, కనిష్టంగా రూ.6.50, సరాసరిన రూ.10 ప్రకారం పలికాయి.

గరిష్టం/కనిష్టం
38.1°/23.4°

జిల్లా అంతటా గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం తగ్గడంతో ఉక్కపోత పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

న్యాయ సాయంపై అవగాహన



జిల్లా జైలులో ఖైదీలతో మాట్లాడుతున్న గరికపాటి దీనబాబు

అనంతపురం: జిల్లా న్యాయ సేవల ప్రాధికార సంస్థ కార్యదర్శి గరికపాటి దీనబాబు జిల్లా జైలును గురువారం సందర్శించారు. ఆహారం ఎలా ఉంది? ఆరోగ్యం బాగుందా? అంటూ ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. జైలు అధికారులు అందిస్తున్న సౌకర్యాలు, న్యాయ సేవల లభ్యత, అప్పీల్ హక్కు , ప్లీ బేరసారాలు, న్యాయసాయం గురించి ఖైదీలకు అవగాహన కల్పించారు.

జిల్లాకు వెయ్యి మెట్రిక్ టన్నుల యూరియా



యూరియాను పరిశీలిస్తున్న ఏడీఏ ఎం.రవి

అనంతపురం అగ్రికల్చర్: నాగార్జున కంపెనీకి చెందిన వెయ్యి మెట్రిక్ టన్నులు యూరియా గురువారం జిల్లాకు చేరినట్లు రేక్ ఆఫీసర్, ఏడీఏ ఎం.రవి తెలిపారు. స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ రేక్ పాయింట్‌కు వెళ్లి వ్యాగన్ల ద్వారా వచ్చిన యూరియాను పరిశీలించామన్నారు. ఖరీఫ్ ఎరువుల ప్రణాళికలో భాగంగా నెలవారీ కోటా మేరకు వివిధ కంపెనీల నుంచి అన్ని రకాల ఎరువులు సరఫరా అవుతున్నాయని చెప్పారు. కలెక్టర్, జేసీ, డీఏఓ ఆదేశాల మేరకు మొదటి ప్రాధాన్యతగా ఆర్‌బీకేలు, సొసైటీలు, ఇండెంట్ మేరకు ప్రైవేట్, హోల్‌సేల్ డీలర్లకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. మిగతావి మార్క్‌ఫెడ్, కంపెనీ గోదాముల్లో నిల్వ చేస్తున్నట్లు వివరించారు.

3న బాలుర క్రికెట్ జట్టు ఎంపిక

అనంతపురం: అనంతపురం స్పోర్ట్స్ అకాడమీలో ఈనెల 3వ తేదీన అండర్–14 బాలుర క్రికెట్ జట్టును ఎంపిక చేయనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కే.మధు ఆచారి ఓ ప్రకటనలో తెలిపారు. 13–14 సంవత్సరాల వయస్సు ఉన్న బాలురు శుక్రవారం ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్, ఫారమ్–5 పుట్టిన తేదీ ధ్రువపత్రం అందించాలని కోరారు. ఆసక్తి గల వారు యూనిఫాంతో సొంత క్రికెట్ కిట్ తీసుకుని రావాలని సూచించారు.

నేటి నుంచి రేషన్ పంపిణీ



అనంతపురం అర్బన్: జిల్లాలోని బియ్యం కార్డుదారులకు సెప్టెంబరు నెలకు సంబంధించి శుక్రవారం నుంచి రేషన్‌ను ఎండీయూ వాహనాల ద్వారా పంపిణీ చేస్తారని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఒక ప్రకటనలో తెలిపారు. బియ్యం కార్డుదారులకు ఉచితంగా పౌష్టికమైన ఫోర్టిఫైడ్ బియ్యం ఇస్తారన్నారు. అలాగే నిత్యావసర సరుకులు అందిస్తారని పేర్కొన్నారు. కార్డుదారులు కోరిన మేరకు కిలో నుంచి మూడు కిలోల వరకు బియ్యం స్థానంలో రాగులు, జొన్నలను ఉచితంగా ఇస్తారన్నారు. అనంతపురం నగరంతో పాటు జిల్లాలోని అన్ని మునిసిపాలిటీల్లోనూ గోధుమపిండి ఒక కిలో రూ.16 చొప్పున ఇస్తారని తెలిపారు.

బడి.. నూతన ఒరవడి

- ఇప్పటికే నాడు–నేడుతో సరికొత్త కళ
- 'పీఎంశ్రీ'తో మరిన్ని మౌలిక వసతులు
- ఒక్కో పాఠశాలకు రూ.46 లక్షల వరకు కేంద్రం నిధులు
- రెండో విడతలో 717 పాఠశాలల రిజిస్ట్రేషన్



తరగతి గదిలో విద్యార్థులు

రాప్తాడురూరల్: పేదరికాన్ని నిర్మూలించి సమాజాన్ని అభివృద్ధి దిశగా పరుగు పెట్టించాలంటే చదువు ఒక్కటే ఏకైక మార్గం అని భావించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'మనబడి నాడు–నేడు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగానే రాష్ట్రంలోని ప్రభుత్వ బడులు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కూడా ఓ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ పాఠశాలల దశ, దిశ మార్చేలా 'పీఎం శ్రీ' (ప్రధాన్ మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకాన్ని తీసుకొచ్చారు.

ప్రాథమిక పాఠశాలలు సైతం..

'పీఎం శ్రీ' పథకం ద్వారా ఎంపిక చేసిన పాఠశాలల్లో లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తూ మౌలిక వసతులు కల్పించనున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'మనబడి నాడు–నేడు' కార్యక్రమానికి 'పీఎం శ్రీ' పథకం తోడైతే సర్కారు బడుల్లో వసతుల లేమి అనేదే ఉండదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. అనంతపురం జిల్లాలో తొలివిడతలో 37 స్కూళ్లను 'పీఎం శ్రీ' పథకానికి ఎంపిక చేశారు. రెండో విడత కోసం 717 స్కూళ్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి. దరఖాస్తులను ప్రత్యేక కమిటీ పరిశీలించి పాఠశాలలను ఎంపిక చేస్తుంది. ఈ పథకం కింద ఎంపికైన పాఠశాలలకు మూడేళ్లలో రూ.46 లక్షలు అందిస్తారు. తొలివిడతలో ఎంపికైన పాఠశాలల్లో పీఎంశ్రీ పథకం కోసం ప్రత్యేకంగా బ్యాంకు ఖాతాలు తెరిచారు. ఈ వివరాలన్నీ కేంద్రానికి పంపారు. తొలివిడతలో ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉండగా, రెండో విడతలో ప్రాథమిక పాఠశాలలను కూడా చేర్చారు.

ప్రాధాన్యతా అంశాలు ఇలా..

'పీఎం శ్రీ' పథకానికి ఎంపికైన స్కూళ్లల్లో భవనాల నిర్మాణం, మరుగుదొడ్లు, గ్రంథాలయాలు, సౌర విద్యుత్ ఏర్పాటు, కాయగూరల తోట, ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దడం, శుద్ధజలం, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఐసీటీ) ల్యాబ్, డిజిటల్ గ్రంథాలయం, క్రీడలకు ప్రోత్సాహం, ఇంటర్నెట్ సదుపాయం, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ, వృత్తివిద్యా కోర్సులు, నైపుణ్యాభివృద్ధి తదితర వాటికి నిధులను ఖర్చు చేస్తారు. స్కూల్ దశ నుంచే ఒకేషనల్ కోర్సులను ప్రోత్సహిస్తారు.

తొలివిడతగా ఎంపికైన స్కూళ్లు

కురుగుంట బాలికల ఏపీఆర్ స్కూల్, అనంతపురం గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్, జెడ్పీహెచ్ఎస్ ఆత్మకూరు, జెడ్పీహెచ్ఎస్ ఎన్.గుండ్లపల్లి, జెడ్పీహెచ్ఎస్ బొమ్మనహాళ్, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బ్రహ్మసముద్రం, జెడ్పీహెచ్ఎస్ బీకే సముద్రం, జెడ్పీహెచ్ఎస్ ముదిగడి, ఏపీఎంఎస్ గార్లదిన్నె, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ రజాపురం, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ (బాలికలు) గుత్తి, జెడ్పీహెచ్ఎస్ గొల్లపల్లి, జెడ్పీహెచ్ఎస్ పాత కొత్తచెరువు, ఎస్ఆర్‌కే మునిసిపల్ హైస్కూల్ గుంతకల్లు, ఎంపీయూపీఎస్ పాలవాయి, ఏపీఎంఎస్ కళ్యాణదుర్గం, ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌హెచ్ఎస్ తిమ్మాపురం, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ రామ్‌నగర్, ఎంపీయూపీఎస్ ఉదిరిపికొండ, జెడ్పీహెచ్ఎస్ ఎనుములదొడ్డి, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బి.పప్పూరు, జెడ్పీహెచ్ఎస్ ఖాదర్‌పేట, టీసీ ప్రభుత్వ పాఠశాల పామిడి, జెడ్పీహెచ్ఎస్ పెద్దపప్పూరు, జెడ్పీహెచ్ఎస్ లక్షుంపల్లి, జెడ్పీహెచ్ఎస్ కడవకల్లు, జెడ్పీహెచ్ఎస్ రాప్తాడు, ఎంపీయూపీఎస్ కొంతనపల్లి, ఏపీఎంఎస్ రాయదుర్గం, ఏపీఎంఎస్ శెట్టూరు, జెడ్పీహెచ్ఎస్ తరిమెల, జెడ్పీహెచ్ఎస్ చుక్కలూరు, జెసీఎస్ఆర్ మునిసిపల్ స్కూల్ తాడిపత్రి, ఏపీ రెసిడెన్షియల్‌స్కూల్ ఉరవకొండ, ఏపీఎంఎస్ వజ్రకరూరు, జెడ్పీహెచ్ఎస్ విడపనకల్, జెడ్పీహెచ్ఎస్ రాయలచెరువు, జెడ్పీహెచ్ఎస్ తిమ్మంపల్లి.

రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి



'పీఎంశ్రీ' పథకానికి ఎంపికైన స్కూళ్లకు కేంద్రం నుంచి ప్రత్యేకంగా నిధులు వస్తాయి. మౌలిక వసతుల కోసం ఖర్చు చేసుకోవచ్చు. తొలివిడతగా జిల్లాలో 37 స్కూళ్లను ఎంపిక చేశారు. రెండో విడత కోసం 717 స్కూళ్లు ఆన్‌లైన్‌లో రిజి స్ట్రేషన్ చేసుకున్నాయి. జిల్లాస్థాయి కమిటీ పరిశీలించి ఖరారు చేసిన తర్వాత రాష్ట్ర అధికారుల ద్వారా కేంద్రానికి నివేదిక పంపుతాం.

– ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, సమగ్ర శిక్ష ఏఎంఓ

స్కూళ్లలో మరింత అభివృద్ధి



ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాడు–నేడు కార్యక్రమంతో పాఠశాలల్లో అనేక మౌలిక వసతులు కల్పించడంతో కార్పొరేట్ తరహాలో ఉన్నాయి. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'పీఎంశ్రీ' పథకం ద్వారా కూడా మరిన్ని వసతులు కల్పించే వీలుంది. రెండోవిడతగా 717 స్కూళ్లు రిజిస్ట్రేషన్లు చేయించాం. ఎంపిక ప్రక్రియను ప్రత్యేక కమిటీ చూస్తుంది.

– వి.నాగరాజు జిల్లా విద్యాశాఖ అధికారి

భూసేకరణ పనులు వేగవంతం



మ్యాప్ పరిశీలిస్తున్న ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి

రాయదుర్గం రూరల్: భూసేకరణ పనులు వేగవంతం చేయాలని ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఆయన తహసీల్దార్ మారుతీతో కలిసి సర్వేయర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని వేపరాల వద్ద ఏపీఐఐసీ ఆధ్వర్యంలో ఫ్యాక్టరీల కోసం సేకరించిన 130 ఎకరాల భూమి, పట్టణంలోని రైల్వేస్టేషన్ ఆధునీకరణలో భాగంగా భూసేకరణ, అనంతపురం రోడ్డు నుంచి వయా కణేకల్లు రోడ్డు మీదుగా బళ్లారి రోడ్డును కలిపే బైపాస్ రోడ్డు నిర్మాణానికి చేపట్టే భూసేకరణ పనులు వేగవంతం చేయాలన్నారు. అలాగే మండలంలోని బీఎన్ హళ్లి, గ్రామదట్ల, డి.కొండాపురం, వజ్రహొన్నూరు గ్రామాల్లో చేస్తున్న భూరీసర్వే పనులపై కూడా ఆయన సమీక్షించారు. కార్యక్రమంలో సర్వేయర్ బాలగంగయ్య, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

సెంట్రల్ యూనివర్సిటీలో అడ్మిషన్లు పూర్తి



అనంతపురం: సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో మూడో దశ యూజీ, పీజీ అడ్మిషన్లు పూర్తయినట్లు వీసీ ఎస్ఏ కోరి తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించిన మూడో దశ అడ్మిషన్లు రూల్ ఆఫ్ రిజర్వేషన్లు, రోస్టర్ పాయింట్లు పాటించి పకడ్బందీగా పూర్తి చేశామన్నారు. అడ్మిషన్ల జాబితాను సెంట్రల్ యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు.

సఫాయి కర్మచారులను గుర్తించండి



మాట్లాడుతున్న జేసీ కేతన్‌గార్గ్, చిత్రంలో ఏఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి, జేడీ మధుసూదన్

అనంతపురం అర్బన్: జిల్లాలో సఫాయి కర్మచారులను (మాన్యువల్ స్కావెంజర్స్) గుర్తించాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీల సమస్యలను సత్వరం పరిష్కరించాలని, అట్రాసిటీ కేసుల్లో బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని చెప్పారు. సఫాయి కర్మచారుల వ్యవస్థ నిర్మూలనపై జాయింట్ కలెక్టర్ గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏఎస్పీ రామిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, సాంఘిక సంక్షేమశాఖ జేడీ మధుసూదన్‌తో కలిసి మునిసిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారి, ఇతర శాఖల అధికారులతో విజిలెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాన్యువల్ స్కావెంజర్స్ చట్టం–2013ను జిల్లా అమలు చేయాలన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో సఫాయి కర్మచారులు ఎంత మంది ఉన్నారనేది గుర్తించేందుకు సర్వే నిర్వహించాలన్నారు. కమ్యూనిటీ, పబ్లిక్ ప్రాంతాల్లో ఎవరైనా సఫాయి కార్మికులు ఉన్నారా? ఉంటే వారు ఏ పనిచేస్తున్నారు? ప్రభుత్వం నుంచి వారికి ఎలాంటి సదుపాయాలు కల్పించాలి అనేది గుర్తించాలన్నారు. సర్వే చేసి పదిరోజుల్లో నివేదిక అందించాని ఆదేశించారు. మునిసిపాలిటీల్లో నూతనంగా నిర్మించే భవనాల యాజమానులు మరుగుదొడ్డికి గుంతలు (పిట్) తవ్విస్తున్నారా? లేదా? అనేది పరిశీలించాలన్నారు. మరుగుదొడ్డి పైప్‌లైన్‌ను కాలువకు కలిపి ఉంటే జరిమానా విధించాలని ఆదేశించారు.

గౌరవంగా జీవించేలా చూడాలి

సఫాయి కర్మచారులు గౌరవంగా జీవించేందుకు ప్రభుత్వం నుంచి పునరావాసం, ఆర్థిక సహాయం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని జేసీ ఆదేశించారు. వారి కుటుంబ సభ్యులకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించి స్వయం ఉపాధి పొందేలా చూడాలన్నారు. నిబంధనల ప్రకారం వారికి మాస్కులు, గ్లౌజులు, బూట్లు, కొబ్బరినూనె, సబ్బు, హెల్మెట్, సేఫ్టీ ప్యాక్, ఫస్ట్ ఎయిడ్ కిట్, తదితర 44 రకాల భద్రత పరికరాలు, సదుపాయాలు కల్పించాలన్నారు. సమావేశంలో డీపీఓ ప్రభాకర్‌రావు, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, డీఎంహెచ్ఓ దేవి, ఎల్‌డీఎం సత్యరాజ్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సుజాత, విజిలెన్స్ కమిటీ సభ్యుడు పెన్నోబులేసు, అధికారులు పాల్గొన్నారు.

ధర్మవరం ఫ్లైఓవర్ బ్రిడ్జికి గ్రీన్‌సిగ్నల్

అనంతపురం టవర్‌క్లాక్: ధర్మవరం పట్టణంలో కదిరి గేట్ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించేందుకు నూతనంగా ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ధర్మవరం నుంచి అనంతపురం వైపు రోజూ వందలాది వాహనాలు, బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రోడ్లు భవనాల శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. దీనికి ప్రభుత్వం ఆమోద ముద్ర వేస్తూ రూ.50 కోట్లు మంజూరు చేసినట్లు ఆర్అండ్‌బీ ఎస్ఈ ఓబులరెడ్డి తెలిపారు. త్వరలోనే టెండర్లు ఖరారు చేసి బ్రిడ్జి పనులు మొదలు పెడతామన్నారు. అలాగే రాయదుర్గం నుంచి గలగల, తాళ్లకెర గ్రామాల మీదుగా కూడ్లిగి వెళ్లే రహదారి, రాయదుర్గం – భూపసముద్రం రహదారి ఆధునికీకరణకు కలిపి మొత్తం రూ. 26 కోట్లు మంజూరైనట్లు వివరించారు.

రూ.100 కోట్లతో విద్యుత్ పనులు

- వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తామని ఎస్ఈ సురేంద్ర వెల్లడి

అనంతపురం టౌన్: విద్యుత్ తీగలు మరమ్మతు పనులు చేపట్టేందుకు సంస్థ రూ.23 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు విద్యుత్‌శాఖ ఎస్ఈ సురేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మరమ్మతుకు గురైన విద్యుత్ స్తంభాల స్థానాల్లో కొత్త స్తంభాల ఏర్పాటుతో పాటు కొత్త విద్యుత్ తీగలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే కళ్యాణదుర్గం సబ్ డివిజన్ పరిధిలోని కణేకల్లు, బొమ్మనహాళ్, కళ్యాణదుర్గం తదితర ప్రాంతాల్లో విద్యుత్ తీగలను ఏర్పాటు చేసే ప్రక్రియను చేపడుతున్నట్లు వివరించారు.

37 నూతన సబ్‌స్టేషన్ల మంజూరు

జిల్లా వ్యాప్తంగా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు 37 కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉమ్మడి జిల్లాకు మంజూరు చేస్తూ ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు ఉత్తర్వులను జారీ చేశారన్నారు. ఇందుకు కోసం రూ.82 కోట్ల నిధులను సైతం మంజూరు చేశారని చెప్పారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో సబ్ స్టేషన్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. రానున్న రెండు నెలల్లో సబ్ స్టేషన్ల నిర్మాణ పనులను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. నిర్మాణ పనులు పూర్తయితే రైతులతో పాటు గృహ అవసరాల విద్యుత్ సరఫరాకు సైతం అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుందని తెలిపారు.

త్వరలో ఐఏబీ సమావేశం

అనంతపురం సెంట్రల్: ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేసేందుకు కీలకమైన సాగునీటి సలహా మండలి సమావేశం (ఐఏబీ) నిర్వహణకు హెచ్చెల్సీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే కలెక్టర్ ఆమోదం కోసం ఫైల్ పంపారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మంత్రి ఉషశ్రీచరణ్ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు. సెప్టెంబర్ మొదటి వారంలో సమావేశం నిర్వహించవచ్చని అధికార వర్గాలు వెల్లడించాయి.

పుట్టపర్తిలో భారీ వర్షం

ప్రశాంతి నిలయం: పుట్టపర్తి పట్టణంలో గురువారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలో శ్రీజ మిల్క్‌డెయిరీ వద్ద ఓ వేప వృక్షం కుప్పకూలింది. ఆటోపై పడడంతో దాని ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. సుమారు రూ.30 వేల నష్టం జరిగినట్లు బాధిత ఆటో డ్రైవర్ రవీంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబులపతి, సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. జేసీబీల సాయంతో కూలిన చెట్లను తొలగించారు.



ఆటోపై కూలిన వృక్షం



జేసీబీ సాయంతో చెట్టును తొలగిస్తున్న దృశ్యం

చట్టాలపై అవగాహన అవసరం

- సివిల్ రైట్స్ డేలో ఎస్పీ కె. శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నేటితరం యువత చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ కె. శ్రీనివాసరావు తెలిపారు. గురువారం జిల్లా వ్యాప్తంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం జిల్లా కేంద్రంతో పాటు జిల్లా వ్యాప్తంగా పలు ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సంబంధిత పోలీసులతో పాటు రెవెన్యూ, సాంఘిక సంక్షేమశాఖ, గ్రామ సచివాలయ కార్యదర్శులతో కలసి అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ సిబ్బందికి పలు సూచనలు, సలహాలిచ్చారు. అట్టడుగు వర్గాలకు చట్టాలపై అవగాహన కల్గిస్తే వారు న్యాయం కోసం పోరాడే అవకాశం ఉంటుందన్నారు. వారి హక్కులను కాపాడుకునే కనీస చైతన్యం వారిలో కలిగించాలన్నారు. రాజ్యాంగంలోని చట్టాలు, పౌర హక్కులపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనందిరిపై ఉందన్నారు.

● వినాయక సందడి



వినాయకుని ప్రతిమకు తుదిమెరుగులు దిద్దుతున్న మహిళ



వినాయక విగ్రహాల కొనుగోలుకు వచ్చిన యువకులు



సిద్ధమైన గణపయ్య విగ్రహం

వినాయక చవితి సమీపిస్తుండటంతో పండుగ సందడి మొదలైంది. విగ్రహాల తయారీ ఊపందుకుంది. నగరంలోని వివిధ ప్రాంతాల్లో బొజ్జ గణపయ్యల విగ్రహాలను తయారు చేస్తున్నారు. ముందుగానే ఆర్డర్లు ఇచ్చి తమకు కావాల్సిన రూపాల్లో ప్రతిమలను తయారు చేయించుకుంటున్నారు. కొన్నిచోట్ల విగ్రహాల అమ్మకాలు కూడా మొదలయ్యాయి. రూ.4 వేలు మొదలు రూ.50 వేల ధర వరకు విగ్రహాలు అందుబాటులో ఉన్నాయని తయారీదారులు చెబుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు

అనంతపురం టౌన్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో భాగంగా గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లు నిర్మాణాలు చేపట్టిన కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు చేసినట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న రూ.48 కోట్ల నిధుల ను దశల వారీగా కాంట్రాక్టర్ల ఖాతాల్లో జమ చేశామన్నారు. గురువారం మరో రూ. 3 కోట్ల నిధులు మంజూరు కావడంతో వాటిని సైతం కాంట్రాక్టర్ల ఖాతాల్లో గురువారం జమ చేశామన్నారు. దీంతో ఇప్పటికే నిర్మాణ దశల్లో ఉన్న ప్రతి భవనానికి ఆ స్థాయిని బట్టి 100 శాతం నిధులను మంజూరు చేసినట్లు స్పష్టం చేశారు. కాంట్రాక్టర్లు సైతం సకాలంలో భవన నిర్మాణ పనులు పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

క్లుప్తంగా

డీసీసీబీలో మరో ఐదుగురు డైరెక్టర్ల నియామకానికి చర్యలు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ యం.లిఖిత

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) పాలకవర్గంలో మరో ఐదుగురు ప్రొఫెషనల్ డైరెక్టర్లుగా నియమించేందుకు కమిటీ ఆమోదం తెలిపింది. గురువారం స్థానిక డీసీసీబీ హాలులో జరిగిన పాలకవర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత మాట్లాడుతూ... ప్రస్తుతం ఇద్దరు ప్రొఫెషనల్ డైరెక్టర్లు ఉండగా మరో ఐదుగురి నియామకానికి చర్యలు తీసుకున్నట్లు వివరించారు. అలాగే సహకార సంఘాల్లోనూ ఐదుగురు ఉండేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో సీఈఓ, డైరెక్టర్లు పాల్గొన్నారు.

చిరుత దాడిలో గేదె మృతి



కుందుర్పి: చిరుత దాడిలో ఓ గేదె మృతి చెందింది. స్థానికులు తెలిపిన మేరకు... కుందుర్పి మండలం కెంచంపల్లికి చెందిన రామాంజినేయులు పాడి పోషణతో జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల రూ.15 వేలు వెచ్చించి ఓ గేదెను కొనుగోలు చేశాడు. గురువారం ఉదయం గేదెను గ్రామ శివారులోకి మేపునకు తోలుకెళ్లినప్పుడు చిరుత దాడి చేసింది. గేదె మెడను నోటకరుచుకుని లాక్కెళుతుండగా గమనించిన పాడి రైతు కేకలు వేస్తూ అదిలించడంతో అటవీ ప్రాంతంలోకి చిరుత పారిపోయింది. అప్పటికే గేదె మృతి చెందింది.

దీపిక.. విజయ పతాక



భారత జట్టుతో దీపిక బృందం



జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన దీపికను అభినందిస్తున్న కెప్టెన్ రూప

- అంధుల క్రికెట్‌లో రాణిస్తున్న అమరాపురం యువతి
- అంధుల మహిళా క్రికెట్ ప్రపంచ కప్ విజయంలో కీలక పాత్ర

అమరాపురం: ఆమె ముందు వైకల్యం తలవంచింది. క్రీడా ప్రపంచం దాసోసహమంది. పట్టుదల, కృషి, కఠోర సాధన, క్రమశిక్షణతో అనుకున్న లక్ష్యం సాధించిందిన దీపిక.... ప్రపంచ అంధుల మహిళా క్రికెట్ టీ20లో భారత జట్టు విజయకేతనం ఎగురవేయడంలో కీలక పాత్ర పోషించింది. యావత్తు దేశం గర్వించదగ్గ క్రికెట్ క్రీడాకారిణిగా ఖ్యాతిని సొంతం చేసుకుంది. శ్రీసత్యసాయి జిల్లా అమరాపురం మండలం తంబాలహట్టికి చెందిన దీపిక విజయ ప్రస్థానంపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

నిరుపేద కుటుంబంలో పుట్టి..

అమరాపురం మండలం హేమావతి పంచాయతీ తంబాలహట్టి గ్రామానికి చెందిన చిత్తమ్మ, చిక్కతిమ్మప్ప దంపతుల కుమార్తె టీసీ దీపిక ప్రస్తుతం బెంగళూరులోని విజయనగర కళాశాలలో డిగ్రీ చదువుతోంది. పుట్టుకతోనే దీపికకు 70 శాతం దృష్టి లోపం ఉంది. అయితే పేదరికం కారణంగా చిరు ప్రాయంలోనే ఆమెకు తల్లిదండ్రులు సరైన చికిత్స చేయించలేకపోయారు. కర్ణాటకకు కూతవేటు దూరంలో ఉన్న గ్రామం కావడంతో దొడ్డబాణగెరలో కన్నడ మాధ్యమంలోనే ప్రాథమిక విద్యాభ్యాసం చేసింది. 4వ తరగతి విద్యార్థిగా ఉన్నప్పుడు ఆమె కంటి చూపుతో ఇబ్బంది పడుతున్నట్లుగా గుర్తించిన ఉపాధ్యాయులు వైద్య పరీక్షలు నిర్వహించి తుమకూరు జిల్లా కుణిగల్‌లోని అంధుల పాఠశాలలో చేర్పించారు. 5 నుంచి 7వ తరగతి వరకూ అక్కడే ఆమె చదువుకుంది. అనంతరం 8 నుంచి పదో తరగతి వరకూ మైసూరులోని రంగారావు మెమోరియల్ స్కూల్ ఫర్ డిసేబుల్డ్ పాఠశాలలో చదువుకుని, శిర తాలూకా బరగూరులో పీయూసీ పూర్తి చేసింది.



తల్లిదండ్రులతో దీపిక

క్రికెట్ అంటే మక్కువ..

మైసూరులోని పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నప్పుడు 2016లో పాఠశాల స్థాయి క్రికెట్ పోటీ నిర్వహించారు. ఈ పోటీల్లో తాను ఆడిన తొలి మ్యాచ్‌లోనే ఏకంగా వంద పరుగులు సాధించి అందరి దృష్టిని ఆకర్షించింది. ఆమెలోని క్రీడాకారిణిని గుర్తించిన ఉపాధ్యాయులు అన్ని విధాలుగా ప్రోత్సహిస్తూ వచ్చారు. అదే ఏడాది బెంగళూరు వర్సెస్ మైసూరు జట్లు తలపడగా మరలా దీపిక 3 వికెట్లతో పాటు 78 పరుగులు చేసి తనలో దాగున్న ఆల్‌రౌండర్ ప్రతిభను వెలికి తీసింది. ద్వితీయ పీయూసీ చదువుతున్నప్పుడు బెంగళూరులోని ఐడీఎల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో దీపిక సెంచరీతో కదం తొక్కి సమర్థనం సంస్థ నిర్వాహకుల దృష్టిని ఆకర్షించింది. దీపిక గురించి ఆరా తీసిన సంస్థ నిర్వాహకులు వెంటనే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో మాట్లాడారు. దీపికకు క్రికెట్ శిక్షణ ఇప్పిస్తామని, ఇందుకు అయ్యే మొత్తం ఖర్చును సంస్థనే భరిస్తుందని భరోసానిచ్చారు. సంస్థ సహకారంతో క్రికెట్‌లోని మెలకువలపై పట్టు సాధించిన దీపిక ఆ తర్వాత వరుస రంజీ ట్రోఫీలో తన సత్తా చాటి భారత అంధుల మహిళా క్రికెట్ జట్టుకు కర్ణాటక రాష్ట్రం నుంచి ఎంపికైంది.

చరిత్ర సృష్టించిన అంధుల మహిళల క్రికెట్ జట్టు..

గత నెల ఇంగ్లాండ్‌లోని బర్మింగ్‌హామ్‌లో జరిగిన అంధుల మహిళాక్రికెట్ ప్రపంచ కప్ పోటీల్లో ఆస్ట్రేలియా, ఇంగ్లాండు, భారత జట్లు తలపడ్డాయి. ఇందులో ఫైనల్స్‌కు చేరుకున్న భారత జట్టు ఆస్ట్రేలియాతో తలపడింది. మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 114 పరుగులు చేసింది. ఇంతలోనే వర్షం రావడంతో మ్యాచ్‌ను న్యాయనిర్ణేతలు భారత జట్టుకు 9 ఓవర్లలో 45 పరుగులు చేయాలని నిర్ణయించారు. బ్యాటింగ్ ప్రారంభంలోనే వికెట్ పడడంతో భారత క్రీడాకారులు కంగారు పడ్డారు. ఆ సమయంలో కెప్టెన్ వర్ష సరైన నిర్ణయం తీసుకుంటూ దీపికను రెండో స్థానంలో బ్యాటింగ్ చేయాలని పంపారు. తనపై కెప్టెన్ ఉంచుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా దీపిక 8 బంతుల్లో 22 పరుగులు చేసి, అజేయంగా నిలుస్తూ భారత జట్టు గెలుపులో కీలకంగా మారారు.



అమ్మనాన్నల ప్రోత్సాహం మరువలేనిది

చిన్నప్పుడే కంటి చూపుతో బాధపడుతున్న నేను అన్నింటా ముందుండాలంటూ అమ్మ, నాన్న ప్రోత్సహించడం మరువలేను. వారి వల్లనే నేనీ స్థాయికి ఎదిగాను. నేను పుట్టింది ఆంధ్రలో అయితే.. చదువుకున్నది కర్ణాటకలో కాబట్టి ఈ రెండు రాష్ట్రాల ప్రభుత్వాల నుంచి నేను ఆశించేది ఒక్కటే... ఏదైనా ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తే ఆర్థిక ఇబ్బందుల నుంచి కుటుంబం గట్టెక్కుతుంది. చిన్నప్పటి కలెక్టర్ కావాలనే కోరిక నాలో బలంగా ఉంది. ఆ దిశగా కోచింగ్‌కు దాతలెవరైనా సహకారం అందించాలని కోరుతున్నా.

– దీపిక, అంధుల మహిళా క్రికెటర్

క్రమశిక్షణకు మారు పేరు ఎన్‌సీసీ



మాట్లాడుతున్న కమాండర్ కల్నల్ సందీప్ ముంద్రా

కూడేరు: ఎన్‌సీసీ అంటే ఐక్యత, క్రమశిక్షణకు మారుపేరని ఎన్‌సీసీ క్యాంప్ కమాండర్ కల్నల్ సందీప్ ముంద్రా అన్నారు. కూడేరు మండలంలోని ఎన్‌సీసీ నగర్‌లో సీఏటీసీ–6 ఆంధ్రా బెటాలియన్ శిక్షణా తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో క్యాడెట్లనుద్దేశించి కమాండర్ ముంద్రా మాట్లాడారు. నాయకత్వ లక్షణాలు, సేవా గుణం, ఇతర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణ క్యాడెట్ల జీవితంలో టర్నింగ్ పాయింట్ అవుతుందన్నారు. కార్యక్రమంలో మేజర్ సుఖ్‌దేవ్ సింగ్, అనంతపురం, కర్నూలు, నంద్యాల, శ్రీసత్యసాయి జిల్లాలకు చెందిన 525 మంది క్యాడెట్లు, ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.

గ్రంథాలే శాస్త్రసాంకేతిక విద్యకు మూలం



మాట్లాడుతున్న సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ వీసీ ప్రొఫెసర్ ఎస్ఏ కోరి

అనంతపురం: ఆధునిక శాస్త్ర సాంకేతిక విద్యా వ్యవస్థకు మూలం పూర్వీకులు సంస్కృతంలో రచించిన గ్రంథాలేనని సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ వీసీ ఎస్ఏ కోరి అన్నారు. ప్రపంచ సంస్కృత దినోత్సవాన్ని సంప్రదాయం ఉట్టిపడేలా గురువారం సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ.. సుశ్రుతుడు రచించిన గ్రంథం ఆధారంగానే సర్జరీలు మొదలయ్యాయన్నారు. అనేక ముఖ్యమైన వైజ్ఞానిక, గణిత భావనలను శతాబ్దాల క్రితమే సంస్కృత గ్రంథాలు మొదట పేర్కొన్నాయన్నారు. అలాంటి పూర్వీకుల మేథోసంపత్తిని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వైజ్ఞానిక సాహిత్యంలో అనేక ఆధునిక భాషలు నేరుగా సంస్కృతం నుంచి తీసుకున్నవేనన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ యూనివర్సిటీ సంస్కృత విద్యా కేంద్రం అధ్యాపకులు డాక్టర్ విశాల్ ప్రసాద్ భట్ పాల్గొన్నారు.

కోలుకుంటున్న నల్లనాగు బాధితుడు

పెనుకొండ: స్థానిక ట్రామా కేర్ సెంటర్‌లో బుధవారం చొరబడిన నల్లనాగును బంధించే క్రమంలో కాటుకు గురైన రాజు ఆరోగ్య పరిస్థితి మెరుగుపడుతోంది. ఈ మేరకు అనంతపురంలోని సర్వజనాస్పత్రి వైద్యులు గురువారం వెల్లడించారు. పాము కాటుకు గురైనప్పటికీ పట్టు వదలకుండా నల్లనాగును రాజు బంధించి సమీపంలోని పొదల్లోకి వదిలేసిన వైనం తెలిసిందే. పాము కాటు కారణంగా అతని ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో కుటుంబసభ్యులు అనంతపురంలోని సర్వజనాస్పత్రిలో చేర్పించారు. గురువారం కొంత మేర కోలుకున్న రాజు.. కుటుంబ సభ్యులను సైగలతో పలకరించాడు.

మహిళను ఏ మార్చి రూ. 10వేలు అపహరణ



దొంగకు దేహశుద్ధి చేస్తూ ఆటోలో ఎక్కిస్తున్న స్థానికులు

గుత్తి: ఓ మహిళను ఏ మార్చి రూ.10 వేలు అపహరించిన యువకుడిని స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. వివరాలు... గుత్తి మండలం తొండపాడు గ్రామానికి చెందిన పెద్దక్క, ఉమాదేవి.. అదే గ్రామానికి చెందిన అనిల్‌తో కలసి గురువారం ఉదయం ఆటోలో గుత్తిలోని ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రానికి చేరుకున్నారు. అనంతరం ఉమాదేవి డెబిట్ కార్డు నుంచి అనిల్ రూ.25 వేలు డ్రా చేశాడు. ఆ తర్వాత పెద్దక్క డెబిట్ కార్డు నుంచి రూ.10వేలు డ్రా చేస్తున్న సమయంలో నలుగురు ఆగంతకులు లోపలకు వచ్చారు. ఏటీఎం కార్డు ఇలా పెట్టి తీస్తే డబ్బు రాదని నమ్మబలుకుతూ ఓ యువకుడు అనిల్ నుంచి కార్డు తీసుకుని, మాటల్లో పెట్టి నకిలీ కార్డు చేతికి ఇచ్చి పంపాడు. కాసేపటి తర్వాత పెద్దక్క కార్డు నుంచి రూ.10 వేలు డ్రా చేశారు. ఈ విషయం తెలుసుకున్న పెద్దక్క, ఉమాదేవి, అనిల్ వెంటనే స్థానికులను అప్రమత్తం చేసి ఆగంతకుల వెంట పడ్డారు. ముగ్గురు యువకులు కారులో ఉడాయించగా సత్వేందర్ సింగ్ అనే వ్యక్తి పట్టుబడ్డాడు. అప్పటికే ఆగ్రహంతో ఉన్న స్థానికులు దొంగకు దేహశుద్ధి చేసి ఆటోలో పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి అప్పగించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ముద్దచర్మ వ్యాధిపై చైతన్య పరచండి

- పశుశాఖ అడిషినల్ డైరెక్టర్ సింహాచలం ఆదేశం



ఆకుతోటపల్లిలో గర్భకోశవ్యాధుల శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏడీ డాక్టర్ సింహాచలం

అనంతపురం అగ్రికల్చర్: గతేడాది పశువులను కబళించిన ముద్దచర్మవ్యాధి (లంపీస్కిన్ డిసీసెస్) ఈ ఏడాది వ్యాప్తి చెందకుండా ఉండేలా రైతులను చైతన్య పరచాలని పశుసంవర్ధకశాఖ అడిషినల్ డైరెక్టర్ డాక్టర్ సింహాచలం సూచించారు. జిల్లాకు వచ్చిన ఆయన గురువారం స్థానిక పశుశాఖ కార్యాలయంలో జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యంతో కలసి సమీక్షా సమావేశం నిర్వహించారు. వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ముందస్తు చర్యలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అనుమానిత, అవసరమైన ప్రాంతాల్లో ముందస్తు టీకాలు కొనసాగించాలన్నారు. కొత్తగా అమలులోకి వచ్చిన పశుబీమా పథకం పాడి రైతులు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆర్‌బీకే వేదికగా పశుపథకాలు మారుమూల ప్రాంతాల్లో సైతం సమర్థవంతంగా అమలయ్యేలా చూడాలన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో జాతీయ పశుగణన మిషన్ పథకం కింద గొర్రెలు, పందులు, నాటు కోళ్ల పెంపకం, పశుగ్రాస, మాగుడి గడ్డి ఉత్పత్తి కేంద్రం అభివృద్ధికి ఆర్థిక సాయం అందించే అవకాశం ఉన్నందున ఆసక్తి అర్హత కలిగిన రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. సీజనల్, అంటువ్యాధుల నివారణకు పశువైద్య సేవలు మరింత విస్తృతం చేయాలని, క్రమం తప్పకుండా వ్యాక్సినేషన్ కొనసాగించాలని ఆదేశించారు. అంతకు మునుపు రూరల్ మండలం ఆకుతోటపల్లి గ్రామంలో నిర్వహించిన పశువిజ్ఞాన బడి కార్యక్రమానికి హాజరై పశువుల్లో గర్భకోశవ్యాధుల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎల్‌డీఏ ఈఓ డాక్టర్ టి.సుధాకర్, ఏడీలు డాక్టర్ నాగార్జునరెడ్డి, డాక్టర్ వై.రామచంద్రారెడ్డి, డాక్టర్ కేఎల్ శ్రీలక్ష్మి, డాక్టర్ రత్నకుమార్, వీఏఎస్ డాక్టర్ గోల్డ్‌మన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే గిరిజనుల అభ్యున్నతి

- టీటీడీ బోర్డు సభ్యుడు అశ్వత్థనాయక్
- టీటీడీ ట్రస్టు సభ్యుడిగా అవకాశం ఇచ్చినందుకు సీఎంకు ధన్యవాదాలు



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న అశ్వత్థనాయక్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, తదితరులు

అనంతపురం క్రైం: దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్, ఆయన కుమారుడు... ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తప్ప గతంలో ఏ ప్రభుత్వమూ గిరిజనులకు సముచిత స్థానం కల్పించలేదని టీటీడీ బోర్డు సభ్యులు అశ్వత్థనాయక్ అన్నారు. గిరిజనులు అన్ని విధాలుగా అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకున్న సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటామని పేర్కొన్నారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్యతో కలసి గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీటీడీ బోర్డు సభ్యుడిగా తనకు అవకాశం కల్పించినందుకు సీఎంకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనతో పాటు ఎస్టీ కమిషన్ సభ్యుడిగా శివశంకర్‌నాయక్‌కు అవకాశం కల్పించడం ప్రభుత్వానికి గిరిజనుల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. గిరిజనులంతా వైఎస్సార్ కుటుంబం వైపే ఉన్నారన్నారు. పైలా నరసింహయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని వమ్ము చేయకుండా తిరుమల భక్తులకు విశిష్ట సేవలు అందించడం ద్వారా ప్రభుత్వ ప్రతిష్టను మరింత పెంచాలని అశ్వత్థనాయక్‌ను కోరారు. సమావేశంలో అనంతపురం నగర పాలక సంస్థ కార్పొరేటర్ సాకే చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ జిల్లా కోశాధికారి శ్రీనివాస్‌నాయక్, ఆలిండియా బంజారా సేవా సంఘ్ ప్రధాన కార్యదర్శి చక్రీనాయక్, సేవాఘడ్ ట్రస్ట్ సభ్యులు కేశవనాయక్, ఎస్ రంగానాయక్, గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు జి.మల్లికార్జున నాయక్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం టీటీడీ బోర్డు సభ్యుడిగా అశ్వత్థ నాయక్‌కు అవకాశం దక్కడంపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పలువురు గిరిజనులు క్షీరాభిషేకం చేశారు. అంతకు ముందు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

సంచార జీవితాల్లో వెలుగులు నింపిన ప్రభుత్వం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: రాష్ట్రంలో అన్ని విధాలుగా వెనుకబడిన సంచార జాతుల వారిని గుర్తించి ఆదుకున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని, జగన్ పాలనలోనే వారి జీవితాల్లో వెలుగులు నిండాయని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి అన్నారు. సంచార జాతుల 70వ విముక్తి దినోత్సవ కార్యక్రమం గురువారం ఉరవకొండలో ఘనంగా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన సంచార జాతుల వారు స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం నుంచి భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం నిర్వహించిన భారీ బహిరంగ సభకు ముఖ్య అతిథులుగా విశ్వతో పాటు బెస్త, ఎంబీసీ, కురుబ కార్పొరేషన్ల డైరెక్టర్లు రమణ, జోగి వెంకటేష్, గోవిందు హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే విశ్వ మాట్లాడుతూ... గత ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి కారణంగా సంచార జాతుల వారు దుర్భర జీవనం గడుపుతూ వచ్చారన్నారు. సామాజికంగా వారిని గుర్తించేందుకు గత పాలకులకు మనసొప్పలేదని మండిపడ్డారు. ప్రజాసంకల్ప పాదయాత్రలో సంచార జాతుల వారి దుర్భర జీవనాన్ని కళ్లారా చూసిన వైఎస్ జగన్... తాను అధికారంలోకి రాగానే ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి సంచార జాతుల వారి అభ్యున్నతికి చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ అధికారంలోకి రాగానే కార్పొరేషన్ ఏర్పాటుతో పాటు వారి జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు ప్రత్యేక కమిటీని వేసి అధ్యాయనం చేయించారన్నారు. సంచార జాతులకు నిజమైన విముక్తి సీఎం వైఎస్ జగన్ పాలనలోనే దక్కిందన్నారు. కార్యక్రమంలో సంచార జాతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుళ్ళాయప్ప, ఎంపీపీ చంద్రమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, జెడ్పీటీసీ సభ్యురాలు ఏసీ పార్వతమ్మ, సర్పంచ్ లలితమ్మ, ఎంపీటీసీ జోగి మంజుల, నాయకులు జోగి భీమ, హనుమంతు, జోగి రాముడు, తోలుబొమ్మలాట కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జున, మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇంద్రాదేవి పాల్గొన్నారు.

గొర్రెల మందపై కుక్కల దాడి



మృతి చెందిన గొర్రెలు

శింగనమల: వీధి కుక్కలు దాడిచేయడంతో 15 గొర్రెలు మృతి చెందాయి. మరో 20 తీవ్రంగా గాయపడ్డాయి. వివరాలు... శింగనమలకు చెందిన సుబ్రహ్మణ్యం గొర్రెల పోషణతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం గ్రామ శివారు ప్రాంతానికి గొర్రెలను కాపరులు మేపునకు తోలుకెళ్లారు. సాయంత్రం గాలీవాన మొదలు కావడంతో గొర్రెలను తోలుకుంటూ ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో మార్గమధ్యంలో వర్షం అధికమైంది. దీంతో గొర్రెలు చెల్లాచెదురవుతూ చిన్న కాలువ సమీపంలోకి చేరుకున్నాయి. అదే సమయంలో వీధి కుక్కలు ఒక్కసారిగా గొర్రెల మందపై దాడి చేశాయి. వర్షం తగ్గిన తర్వాత చెల్లాచెదురైన గొర్రెలను ఒకచోటుకు చేర్చేందుకు కాపరులు సిద్ధమయ్యారు. చిన్నకాలువ సమీపంలోకి చేరుకోగానే కుక్కల దాడిలో మృతి చెందిన 15 గొర్రెలు కనిపించాయి. తీవ్రంగా గాయపడి కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న మరో 20 గొర్రెలను అతి కష్టంపై గ్రామంలోకి తరలించారు. సమాచారం అందుకున్న గోపాలమిత్ర అక్కడకు చేరుకుని గాయపడిన గొర్రెలకు చికిత్స అందజేశారు. ఘటనతో దాదాపు రూ.3.50 లక్షలు నష్టం వాటిల్లినట్లు కాపరి సుబ్రహ్మణ్యం వాపోయాడు.

కర్ణాటక సరిహద్దున బస్సు ప్రమాదం

హిందూపురం అర్బన్: బెంగళూరు నుంచి ధర్మవరానికి ప్రయాణికులతో బయలుదేరిన ప్రైవేట్ బస్సు (వెంకటేశ్వర) గురువారం రాత్రి కుడమలకుంట (కర్ణాటక సరిహద్దు) వద్ద లారీ ఢీకొంది. బస్సులో 40 మందికి పైగా ప్రయాణికులు ఉన్నారు. బస్సు ముందు భాగంలో కూర్చొన్న ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే 108 అంబులెన్స్ ద్వారా గౌరిబిదనూరులోని ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారి వివరాలు తెలియాల్సి ఉంది. ఘటనపై కర్ణాటక పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

సీఎంకు రుణపడి ఉంటాం

- వీఆర్ఏ సంఘం జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర



ఏపీజీఈఎఫ్ చైర్మన్‌ను కలిసిన వీఆర్ఏ సంఘం నాయకులు

అనంతపురం అర్బన్: గ్రామ రెవెన్యూ సహాయకులకు గత ప్రభుత్వం రద్దు చేసిన రూ.300 డీఏని రూ.500 పెంచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని వీఆర్ఏ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాఘవేంద్ర, ఓబుళేసు, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందరాజులు, కోశాధికారి కాంతరాజు అన్నారు. వీఆర్ఏల తరఫున ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించి ప్రజలకు సేవ చేస్తూ ఉండాలని ఆ దేవుళ్లను ప్రార్థిస్తున్నామన్నారు. వీఆర్ఏల డీఆర్ పెంపునకు కృషి చేసిన ఏపీజీఈఎఫ్ చైర్మన్ వెంకటరామిరెడ్డికి సంఘం తరఫున ధన్యవాదాలు తెలుపుకుంటున్నామన్నారు.

యువతి అదృశ్యం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పెద్ద పప్పూరు మండలం, చిన్నయక్కలూరుకు చెందిన భార్గవి అనే యువతి బుధవారం అదృశ్యమైంది. ఈ మేరకు అనంతపురం త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో యువతి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. భార్గవి అనంతపురంలోని శ్రీనివాసనగర్‌లో అద్దెగదిలో ఉంటూ శ్రేయ ఆస్పత్రిలోని మెడికల్ దుకాణంలో పనిచేస్తోంది. బుధవారం విధులు ముగిసిన తర్వాత ఆమె కనిపించలేదు. దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ధరణీ కిశోర్ తెలిపారు.

మహిళల భద్రత 'దిశ' బాధ్యత



విద్యార్థినులకు దిశ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: మహిళల భద్రత 'దిశ' బాధ్యత అని సీఐ చిన్న గోవిందు పేర్కొన్నారు. గురువారం ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు అనంతపురం కేఎస్ఆర్ పాఠశాలలో అవగాహన కల్పించారు. దిశ యాప్ డౌన్లోడ్, రిజిస్ట్రేషన్, పోక్సో చట్టం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాలు, అనర్థాలు, లైంగిక వేధింపులు, మహిళా రక్షణ చట్టాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సీఐతో పాటు చైల్డ్ వెల్ఫేర్ పోలీస్ అధికారి, టూటౌన్ ఏఎస్ఐ శ్రీనివాసులు, దిశ మహిళా పోలీసు సిబ్బంది, వన్ స్టాప్ సఖీ సెంటర్ సిబ్బంది, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

20 బ్యారికేడ్లు వితరణ



నాగార్జున సిమెంట్స్ యాజమాన్యం అందించిన బ్యారికేడ్లు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నాగార్జున సిమెంట్స్ యాజమాన్యం ఆధ్వర్యంలో 20 బ్యారికేడ్లు అందించినట్లు సీఐ వెంకటేష్‌నాయక్ అన్నారు. గురువారం అనంతపురం ట్రాఫిక్ పోలీసులకు 20 బ్యారికేడ్లను నాగార్జున సిమెంట్ సంస్థ కంపెనీ సేల్స్ ఆఫీసర్ వినోద్ కుమార్ రెడ్డి, సీనియర్ మేనేజర్ సాంబశివారెడ్డి ట్రాఫిక్ సీఐ వెంకటేష్ నాయక్‌కు అందజేశారు. నాగార్జున సిమెంట్ కంపెనీ యాజమాన్యానికి జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీ ప్రసాదరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

డాక్టర్ నరసింహారావు సేవలు మరువలేనివి



నరసింహారావును సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం క్రైం: డాక్టర్ ఏపీ నరసింహారావు సేవలు మరువలేనివని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు పేర్కొన్నారు. గురువారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కార్యాలయంలో ప్రభుత్వ వైద్య కళాశాలలోని ఫార్మకాలజీ విభాగ సహాయ ఆచార్యులు డాక్టర్ ఏపీ నరసింహారావు ఉద్యోగవిరమణ సభ జరిగింది. ఈ సందర్భంగా నరసింహారావు దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో వైద్య కళాశాల అకడమిక్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రమణ్యం, ఏపీ జీజీఏ అధ్యక్షుడు డాక్టర్ రామస్వామి నాయక్, సభ్యులు డాక్టర్ వైఎంఎస్ ప్రసాద్, డాక్టర్ లెక్కల శ్రీదేవి, డాక్టర్ జగన్‌మోహన్ రెడ్డి, ఐఎంఏ మాజీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ యండ్లూరి ప్రభాకర్, జీజీహెచ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రవికుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అనురాగ బంధం..అన్నాచెల్లెళ్ల అనుబంధం



ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డికి రాఖీ కడుతున్న వైఎస్సార్‌సీపీ మహిళలు



ఎస్కేయూ వీసీ రామకృష్ణారెడ్డికి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి



వైశ్య హాస్టల్ ఆధ్వర్యంలో రాఖీ కడుతున్న ఆర్యవైశ్య మహిళలు

అనంతపురం కల్చరల్: శ్రావణ పౌర్ణమి సందర్భంగా గురువారం పలు చోట్ల రక్షాబంధన్ వేడుకలు జరిగాయి. అన్నాచెల్లెళ్లు, అక్కా తమ్ముళ్లు రాఖీ పండుగను ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. ఐదు రోజులుగా రక్షాబంధన్ వేడుకలను నిర్వహిస్తున్న బ్రహ్మకుమారీలు గురువారం ఘనంగా ముగించారు. ఉదయం నుంచే ప్రజాపిత ఈశ్వరీయ బ్రహ్మకుమారీలు పలువురు అధికారులకు, వివిధ కార్యాలయాల సిబ్బందికి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్కేయూ వీసీ రామకృష్ణారెడ్డి, జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఆర్టీవో కార్యాలయంలో డీటీసీ వీర్రాజు తదితరులకు సిస్టర్ శారదా నేతృత్వంలో బ్రహ్మకుమారీలు రాఖీలు కట్టి అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని పెంచే రాఖీ విశిష్టతను తెలియజేశారు. అదేవిధంగా రాత్రి స్థానిక రాజు రోడ్డులోని వైశ్యాహాస్టల్‌లో ఆవో‌పా ప్రాంగణంలో వాసవీ మహిళా మండలి అధ్యక్షురాలు నిర్మలాదేవి, హాస్టల్ ప్రెసిడెంట్ ఆదిశేషయ్య తదితరులు వందలాది మందికి రాఖీలు కట్టి వాటి విశిష్టతను తెలియజేశారు.

ఎమ్మెల్యేకు రాఖీ కట్టిన వైఎస్సార్ సీపీ మహిళలు

అనంతపురం క్రైం: రాఖీ పండుగను పురస్కరించుకుని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి ఆయన నివాసంలో వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాళ్లు గురువారం రాఖీ కట్టారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, మార్కెట్‌యార్డు డైరెక్టర్ శోభారాణి, నాయకురాళ్లు రాధా యాదవ్, సుజాత, ప్రసన్న, షమీం, మునీరా, కమర్‌తాజ్, ఉష, నాగలక్ష్మి, సుప్రజ, హసీనా, నారాయణమ్మ, కమల, యశోద, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

వీసీకి రాఖీ కట్టిన మహిళా ప్రొఫెసర్లు

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్‌కు రక్షా బంధన్ సందర్భంగా మహిళా ప్రొఫెసర్లు గురువారం రాఖీ కట్టారు. అనంతరం వీసీ ఆశీస్సులు తీసుకొని మిఠాయి తినిపించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ సుజాత, ప్రొఫెసర్ వి. సుమలత, ప్రొఫెసర్ శోభాబింధు, ప్రొఫెసర్ మాధవి, డాక్టర్ శారద, ప్రొఫెసర్ అరుణాకాంతి, అజిత, ప్రొఫెసర్ వీబీ చిత్ర తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం: ఏబీవీపీ అనంతపురం నగర శాఖ ఆధ్వర్యంలో జేఎన్‌టీయూ అనంతపురం క్యాంపస్‌లో రక్షా బంధన్ వేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు కమలాకర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు మహేష్, నగర ఉపాధ్యక్షుడు భరత్, మణిదీప్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీకి రాఖీ కట్టిన ఎంపీ కనిమొజి కరుణానిధి

అనంతపురం క్రైం: రాఖీ పండుగను పురస్కరించుకుని కేంద్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ తుత్తుకూడి ఎంపీ కనిమొజి కరుణానిధి గురువారం ఎంపీ తలారి రంగయ్యకు రాఖీ కట్టారు. ప్రస్తుతం ఎంపీ తలారి రంగయ్య తమిళనాడు పర్యటనలో ఉన్న విషయం విదితమే.



ఎంపీ తలారి రంగయ్యకు రాఖీ కడుతున్న ఎంపీ కనిమొజి కరుణానిధి

వైభవంగా నారాయణుడి కల్యాణం

పెద్దపప్పూరు: నిజ శ్రావణమాసం పౌర్ణమి సందర్భంగా గురువారం అశ్వత్థనారాయణ స్వామి క్షేత్రంలో స్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. అర్చకులు సుధీర్‌కుమార్ శర్మ, బాలసుబ్రమణ్య శర్మ నారాయణస్వామి, శ్రీదేవి, భూదేవి ఉత్సవ విగ్రహాలను అందంగా అలంకరించి కల్యాణం జరిపించారు. భక్తులకు ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, కమిటీ సభ్యుడు గంగిరెడ్డి తీర్థప్రసాదాలతోపాటు అన్నదానంఏర్పాటు చేశారు.

5న తలనీలాల వేలం

పెద్దపప్పూరు: అశ్వత్థ నారాయణస్వామి క్షేత్రంలో తలనీలాలు పోగుచేసుకునే హక్కు కోసం 5న వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ సుబ్రహ్మణ్యం గురువారం తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- వన్‌టౌన్ సీఐ రెడ్డెప్ప హెచ్చరిక



అవగాహన కల్పిస్తున్న సీఐ రెడ్డప్ప

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగరంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే రాజీపడేదిలేదని, చర్యలు తప్పవని వన్‌టౌన్ సీఐ రెడ్డెప్ప తెలిపారు. వన్‌టౌన్‌పోలీసు స్టేషన్ పరిధిలో రాత్రివేళ అల్లరి మూకలు పెట్రేగిపోతున్నాయని ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. దీంతో ఆయా కాలనీల్లో స్పెషల్‌పార్టీ పోలీసులతో గస్తీలు నిర్వహించినట్లు తెలిపారు. వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని పలు కాలనీల్లో సీఐ, సిబ్బందితో కలిసి పర్యటించారు. సీఐ మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న కాలనీల్లో అల్లరి మూకలు, రౌడీషీటర్లు స్థానికులకు తలనొప్పిగా మారారని ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. అలాంటి వారి జాబితా సిద్ధం చేసినట్లు తెలిపారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే ఎంతటి వారైనా చట్టపరిధిలో చర్యలు తప్పవన్నారు. ప్రధానంగా బుడ్డప్పనగర్, రాణీనగర్, అంబేడ్కర్‌నగర్, అంబార్‌గేరి, భవానీనగర్, గుత్తి రోడ్డు ప్రాంతాల్లో అల్లరిమూకల చేష్టలు అధికమయ్యాయని తెలిసిందన్నారు.

కాలనీల్లో అవగాహన సదస్సులు:

వన్‌టౌన్ పరిధిలోని కాలనీల్లో ఉచిత 100 డయల్‌పై అవగాహన సదస్సులు నెలరోజుల పాటు కొనసాగిస్తామని సీఐ తెలిపారు. సమస్యాత్మక కాలనీలను ఎంపిక చేసుకొని ఆ ప్రాంత ప్రజలతో కలిసి ఫ్రెండ్లీ పోలీసింగ్ కోసం కృషి చేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటూ నేరుగా డయల్ 100కుగానీ, దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ఆర్టీసీ బస్టాండ్, కమలానగర్ ప్రాంతాల్లోని కళాశాలల వద్ద అమ్మాయిల పట్ల ఆకతాయిల ఆగడాలు అధికమయ్యాయన్నారు. పోలీసులు మఫ్టీలో నిఘా ఉంచామన్నారు. విద్యార్థులు, విద్యార్థినులు ఉచిత 100 డయల్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. నగరంలోని పాతూరులో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతపురం రేంజ్ డీఐజీ ఆర్ఎన్ అమ్మిరెడ్డితో పాటు జిల్లా ఎస్పీ కె. శ్రీనివాసరావు ప్రత్యేక దృష్టిపెట్టారన్నారు.

ఫిట్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు కసరత్తు

- ఆధునిక హంగులతో నగరపాలక సంస్థ జిమ్
- రూ.1.40 కోటితో ప్రధాన నగరాల తరహాలో ఏర్పాటు
- డీపీఆర్ సిద్ధం చేసిన ప్రైవేట్ కన్సల్టెన్సీ



నగరంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న జిమ్ నమూనా

అనంతపురం క్రైం: నగరంలో నగరపాలక సంస్థ ఆధర్యంలో ప్రధాన నగరాలను తలపించేలా ఫిట్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు కసరత్తు ప్రారంభమైంది. ఆదిమూర్తినగర్‌లో గతంలో ఉన్న జిమ్ స్థానంలో అత్యాధునిక సౌలకర్యాలతో ఏర్పాటుకు నగరపాలక సంస్థ ప్రత్యేక దృష్టి సారించింది. కమిషనర్ భాగ్యలక్ష్మి, ఎస్ఈ నాగమోహన్ ఓ ప్రైవేట్ కన్సల్టెన్సీ ద్వారా నూతన జిమ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నారు. నగరంలోని ఆదిమూర్తి నగర్‌లో 1999లో జిమ్ ప్రారంభమైంది. మున్సిపల్ జిమ్‌కు రోజూ 100 నుంచి 150 మంది ఉద్యోగులు, యువత వచ్చి, వినియోగించుకునేవారు. కోవిడ్ నుంచి జిమ్‌ను తాత్కాలికంగా మూసివేశారు. కానీ జిమ్ వద్ద ఉన్న చెట్టు కూలడంతో మున్సిపల్ జిమ్ గోడలు దెబ్బతిన్నాయి. దీంతో పాటు భవనం కూడా పాతబడిపోవడంతో శిథిలావస్థకు చేరింది. నగర ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకున్న మేయర్ ఇటీవల జిమ్‌ను పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న జిమ్ స్థానంలో అత్యాధునిక సదుపాయాలతో నూతన జిమ్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో ఓ ప్రైవేట్ కన్సల్టెన్సీ జీప్లస్ 1 భవనంలో నూతన జిమ్‌ను ఏర్పాటుకు మ్యాప్ సిద్ధం చేసింది. అందులో పురుషులు, మహిళలకు ప్రత్యేకంగా ఉండేలా రూపొందించారు. 5,686 చదరపు అడుగుల్లో భవనాన్ని నిర్మించనున్నారు. అందులో వెయిట్స్ సెక్షన్, వామప్ ఏరియా, పబ్లిక్ ప్లాజా, ఖాళీ స్థలంలో గ్రీనరీ, మిషనరీ జోన్, ఆఫీస్ కార్యాలయం తదితర వాటిని ఏర్పాటు చేయనున్నారు. భవనం ఏర్పాటు కోసం రూ.1.40 కోటి వెచ్చించాలని నిర్ణయించారు. రానున్న రోజుల్లో సిద్ధం చేసిన డీపీఆర్‌ను కౌన్సిల్‌లో ఆమోదించి, టెండర్లు పిలవనున్నారు. భవనం పూర్తిచేసిన తర్వాత అందులోనూ అత్యాధునిక జిమ్ పరికరాలను కొనుగోలు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

గుర్తుండిపోయేలా జిమ్ ఏర్పాటు

నగర ప్రజల ఫిట్‌నెస్‌ను దృష్టిలో ఉంచుకొని జిమ్‌ను అందుబాటులోకి తీసుకురానున్నాం. రోజూ గంటసేపు జిమ్‌ను వినియోగించుకొని ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. అత్యాధునిక పరికాలు, ఎయిర్ కండీషన్, తదితర సౌలభ్యాలతో పాటు పురుషులు, మహిళలకు ప్రత్యేకంగా గదులను ఏర్పాటు చేయిస్తున్నాం. రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా జిమ్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం.

– వసీం, నగరపాలక సంస్థ మేయర్

'గణిత దీప్తి' ఆవిష్కరించిన డీఈఓ



గణిత దీప్తిని ఆవిష్కరిస్తున్న డీఈఓ నాగరాజు

రాప్తాడు రూరల్: జిల్లా గణిత ఫోరం ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థుల కోసం సిద్ధం చేసిన గణిత దీప్తి స్టడీ మెటీరియల్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి వి.నాగరాజు గురువారం తన చాంబరులో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ మెటీరియల్ విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఉ గుత్తి డీవైఈఓ శంకరప్రసాద్ మాట్లాడుతూ.. సీ, డీ గ్రేడుల విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని మెటీరియల్ తయారు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గణిత ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షులు రమణారెడ్డి, ఈశ్వరయ్య, జిల్లా అధ్యక్షుడు వెంకటేశులు, ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, ఆర్థిక కార్యదర్శి రవీంద్రనాథ్, కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్, కుమారస్వామి, మహబూబ్ ఖాన్, చాంద్ బాషా, జయరామ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల ఔదార్యం

అనంతపురం క్రైం: నగరంలోని పోలీసు ట్రైనింగ్ కళాశాల సమీపంలోని రెయిన్ బో గర్ల్స్ వసతి గృహానికి డాక్టర్ దుర్గాప్రసాద్, స్వాంతన దంపతులు రూ.30 వేలు విలువ చేసే ఫ్రిడ్జ్, వాటర్ ఫిల్టర్‌ను గురువారం అందించారు.

సెంట్రల్ పార్కు సర్వే పరిశీలన



పార్కు స్థలం సర్వేపై అధికారులతో మాట్లాడుతున్న మేయర్, డిప్యూటీమేయర్లు

అనంతపురం క్రైం: ఆర్టీసీ బస్టాండ్ నుంచి గుత్తి రోడ్డుకు వెళ్లే మార్గంలోని వేణుగోపాల్‌నగర్ పరిధిలో ఉన్న సెంట్రల్ పార్క్ స్థలం సర్వేను మేయర్ వసీం గురువారం పరిశీలించారు. సర్వే ఏ దశలో ఉందని ఏసీపీ బాలాజీ, సర్వేయర్ ప్రభాకర్‌ను ఆరా తీశారు. పార్క్ స్థలం 5.20 ఎకరాలను గుర్తించడం జరిగిందని, మూడురోజులుగా రోవర్ సహాయంతో సర్వే చేస్తున్నట్లు ఏసీపీ, సర్వేయర్ వివరించారు. మొత్తం 11 సర్వే నంబర్ల పరిధిలో స్థలం ఉందని, త్వరలో రోడ్డు మార్కింగ్ పూర్తి చేస్తామన్నారు. డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కార్పొరేటర్ కమల్‌భూషణ్, నాయకులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయండి

రాప్తాడు: మండలంలో ప్రధాన రహదారుల పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాలల ఎదుట స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని ఎస్ఎస్‌యూఐ జిల్లా నాయకులు మంజునాథ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన రాప్తాడులో విలేకరులతో మాట్లాడారు. మండలంలో ప్రధాన రహదారుల పక్కనే ప్రాథమిక, జిల్లా పరిషత్ పాఠశాలలు ఉన్నాయన్నారు. విద్యార్థులు పాఠశాలల లోపలకు వచ్చి బయటకు వెళ్లే సమయంలో వాహనరాకపోకలతో ఇబ్బంది పడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌యూఐ నాయకులు నవాస్, మహేంద్ర, మహేశ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏడీఎస్ఎస్ఏ సమావేశం

రాప్తాడురూరల్: అనంతపురం జిల్లా సెకండరీ స్కూల్ అథ్లెటిక్ అసోసియేషన్ (ఏడీఎస్ఎస్ఏ) వార్షిక సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 10 గంటలకు అనంతపురం ఆర్ట్స్ కళాశాల డ్రామా హాలులో ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి వి.నాగరాజు ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశంలో క్యాలెండర్‌పై చర్చించి, కార్యాచరణ రూపొందిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా పీఈటీలు, స్కూల్ అసిస్టెంట్లు (వ్యాయామ టీచర్లు) హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.

రైతులను అన్ని విధాలా ఆదుకోవాలి

అనంతపురం రూరల్: వర్షాలు రాక పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని సీపీఎం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం అనంతపురం రూరల్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో జీపు జాతా నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్లప్ప, బాల రంగయ్య, రామాంజనేయులు మాట్లాడారు. వర్షాలు సక్రమంగా రాక పంటలు ఎండిపోతున్నాయని, పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ .50 వేలు పరిహారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, పుష్పరాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణ పౌర్ణమి వేడుకలు



వివిధ ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో సాగిన సత్యదేవుడి వ్రతాలు

అనంతపురం కల్చరల్: నగరంలో శ్రావణ పౌర్ణమి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. సామూహిక సత్యనారాయణ వ్రతాలు, హయగ్రీవ జయంతి వేడుకలు, ఐశ్వర్యేశ్వర వ్రతాలు, ఉపాకర్మ వేడుకలు జరిగాయి. శ్రీసత్యనారాయణుడి దర్శనానికి పోటెత్తిన భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. సత్యనారాయణ నామస్మరణతో మార్మోగాయి. మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వరాలయంలో శాస్త్రోక్తంగా సత్యదేవుడి వ్రతాలు జరిగాయి. మూడో రోడ్డు, వేమన టెలిఫోన్ భవన్ ఎదురుగా ఉన్న బాబా మందిరాల్లో సామూహిక సాయి సత్యదేవుడి వ్రతాలు జరిగాయి. పౌర్ణిమను పురస్కరించుకుని స్థానిక మూడో రోడ్డులోని బ్రాహ్మణ విద్యార్థి వసతి గృహంలో జంధ్యాల పౌర్ణమి, ఉపాకర్మ వేడుకలు జరిగాయి. ఇందులో భాగంగా బ్రాహ్మణ వటువులకు నూతన యజ్ఞోపవీతాలనందించారు.

హైవే వంతెనకింద చెత్తకుప్పకు నిప్పు



బళ్లారి బైపాస్ 44వ జాతీయ రహదారి వంతెన స్తంభం వద్ద ఎగసిపడుతున్న మంటలు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: 44వ జాతీయ రహదారిపై ఉన్న వంతెన వద్ద చెత్తకుప్పకు నిప్పు పెడుతుండడంతో పక్కనే ఉన్న సిమెంట్ స్తంభం పెచ్చులూడుతోంది. స్థానిక బళ్లారి బైపాస్ రోడ్డు నుంచి కళ్యాణదుర్గం రోడ్డు వైపుగా వెళ్లే సర్వీసు రోడ్డులోని అమృత బార్ ఎదుట వంతెన కింద నిత్యం చెత్తకు నిప్పు పెడుతున్నారు. దీంతో మంటలు ఎగసి పడుతున్నాయి. దీనికి తోడు వంతెన పిల్లర్లు మంటలకు కాలి సిమెంటు పెచ్చులు ఊడిపడుతున్నాయి. ఆర్అండ్‌బీ, మున్సిపల్ అధికారులు స్పందించకపోవడంతో సమీప ప్రాంతాల్లోని చెత్తాచెదారాన్ని దుకాణదారులు, మెకానిక్‌లు వేసే చెత్తాచెదారం గుట్టలుగా పేరుకుపోతోంది. దీంతో తరచూ చెత్తకుప్పకు నిప్పు పెడుతున్నారు.

విద్యుత్ కోతలు నివారించాలి

రాప్తాడు: వ్యవసాయానికి విద్యుత్ సక్రమంగా సరఫరా చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఓ నల్లప్ప కోరారు. గురువారం మండల కేంద్రం రాప్తాడులో సీపీఎం నాయకులు జీపుజాతా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్‌లో రూ. 10 లక్షల ఎకరాల్లో వేరుశనగ, కంది, ఆముదం, జొన్న, సద్ద, కొర్ర తదితర పంటలు సాగు చేశారన్నారు. జూలై, ఆగస్టు నెలల్లో వర్షాలు లేకపోవడంతో రైతులు సాగు చేసిన పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయన్నారు. ఎండిపోతున్న పంట పొలాలకు ఎకరాకు రూ.50 వేలు నష్ట పరిహారం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

గుత్తి రూరల్: రజాపురం గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం వేకువజామున ద్విచక్రవాహనం అదుపు తప్పి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. కర్నూలుకు చెందిన నజీర్ పని నిమిత్తం బైక్‌పై గుంతకల్లుకు బయలుదేరాడు. అయితే రజాపురం శివారులో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఎదురుగా ఉన్న మట్టికుప్పను గమనించకుండా వేగంగా వెళ్లడంతో బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో నజీర్ తీవ్రంగా గాయపడ్డాడు.

గిరిజనుల పక్షపాతి వైఎస్ జగన్

అనంతపురం క్రైం: వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గిరిజనులకు పెద్దపీట వేశారని, ఉన్నత పదవులు కల్పించారని గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు మల్లికార్జుననాయక్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. టీటీడీ ట్రస్టు బోర్డు సభ్యుడిగా అశ్వర్థ నాయక్, టీటీడీ భక్తి ఛానల్ అడ్వైజర్‌గా సినీ గాయకురాలు మంగ్లీ బాయికి ఎస్టీ కోటాలో అవకాశం కల్పించారని మల్లికార్జున నాయక్ అన్నారు. సీఎం వైఎస్ జగన్ మేలును మరువలేమన్నారు.

రాఘవేంద్రుల ఆరాధనోత్సవాలు ప్రారంభం



విశేష అలంకరణలో రాఘవేంద్రస్వామి

అనంతపురం కల్చరల్: మూడు రోజుల పాటు సాగే మంత్రాలయ రాఘవేంద్రస్వామి 352వ ఆరాధనోత్సవాలు పూర్వారాధనతో ఘనంగా ప్రారంభమయ్యాయి. గురువారం కావడంతో అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో స్థానిక మొదటిరోడ్డులోని రాఘవేంద్రస్వామి మఠం పరిసరాలు కిటకిటలాడాయి. ఉదయం నిర్మాల్య విసర్జన, వేదపారాయణం, అష్టోత్తర సహిత క్షీరాభిషేకం, కనకాభిషేకాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. మధ్యాహ్నం నైవేద్య సమర్పణ అనంతరం అన్నదానం చేశారు. సాయంత్రం రజిత రథోత్సవ సేవలు, దాసవాణి కార్యక్రమంలో భాగంగా సామూహిక భక్తిగీతాలాపన జరిగాయి.

నేత్రపర్వంగా బలరామకృష్ణుల జయంతి



ఇస్కాన్‌లో పుష్పాభిషేకం

అనంతపురం కల్చరల్: బలరామ జయంతి వేడుకలు ఇస్కాన్ మందిరంలో నేత్రపర్వంగా జరిగాయి. గురువారం ఇస్కాన్ మందిరంలో జిల్లా ఇన్‌చార్జ్ దామోదర గౌరంగదాసు ఆధ్వర్యంలో జరిగిన బలరామ జయంత్యుత్సవాల్లో అధిక సంఖ్యలో కృష్ణ భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం పూల హారతి, మహా అభిషేకం జరిగింది. హరే రామ హరే కృష్ణ నామంతో మందిరం ప్రతిధ్వనించింది. ఊంజల సేవ అనంతరం తీర్థప్రసాద వినియోగం జరిగింది.

IN THE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE, ANANTAPURAMU.

E.P. No. 190/2017 in DISP. No. 215/2015

Between :

M/s. Chalapathi Chit Fund (P) Ltd., Anantapuramu. Rep. by its Manager / Foreman .... Decree Holder

and

B. Chandra Mouleswara Reddy and others ...J.Drs.

2వ ప్రతివాదికి సేల్ నోటీసు

J.Dr2 : Maylay Venkateswara Prasad S/o. M. Narasimhulu R/at Aravind Arcades, Subash Road, Anantapuramu.

పై దావాలో 2వ ప్రతివాది అయిన మీకు సేల్ నోటీసు నిమిత్తము పై కేసు 15-09-2023వ తేదికి వాయిదా కలదు. కనుక మీరు పై తెలిపిన కోర్టు నందు పై తేదీన ఉదయం 10-30 గం॥లకు స్వయముగా గానీ లేక వకీలు ద్వారా గానీ హాజరై మీకేమైన ఆక్షేపణలున్న యెడల తెలుపుకొనవచ్చును. లేనిచో పై దావా మీ పరోక్షమున తీర్మానించబడునని తెల్పడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

బోయపాటి రాజశేఖర్
D.Hr. వకీలు, అనంతపురము.

IN THE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE, ANANTAPURAMU

O.S. No. 531/2014

Between :

K. Suseela Devi ...Plaintiff

And

N. Kariyappa (died) by L.Rs

N. Sunkamma and others ...Defendents

Notice to Defendent No. 2,6 and 7

D2 : N. Sunkamma W/o. Late N. Kariyappa, R/of D.No. 3/59, backside of Sivalayam, Tapovanam, Anantapuramu.

D6 : N. Dhana Sree D/o. Late N. Kariyappa

D7 : N. Veda Sree D/o. Late N. Kariyappa, Both are R/at Flat No. 202, Sai Adarsha Apartments, Kamala Nagar, Anantapuramu.

పై నెంబరు కేసులో ప్రతివాదులు అయిన మీ హాజరు నిమిత్తం 08-09-2023వ తేదీ ఉదయం 10-30 గం॥లకు వాయిదా వేసినారు. ఆరోజు మీరు స్వతహాగా గానీ వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

N.R.K. MOHAN
Advocate, Anantapuramu.